

సాక్షి
ప్రకాశం

రేపటికి
ముందడుగు



శుక్రవారం । 8 । మార్చి । 2024

న్యూస్‌రీల్

ఎల్లో మీడియా కోడిగుడ్డు మీద ఈకలు పీకుతోంది

● మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



టంగుటూరు: చంద్రబాబు, ఎల్లో మీడియా కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఫైర్ అయ్యారు. కొండపిలో మెగా జాబ్ మేళా పూర్తయిన తర్వాత మీడియాతో గురువారం మాట్లాడారు. దళితులను అవమానించి దళితులగా ఎవరు పుట్టాలని కోరుకొంటారు అన్న చంద్రబాబు దళితుల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని అన్నారు. వెలిగొండ సభలో ఆ ప్రాంత ప్రజలు ముఖ్యమంత్రి దగ్గరకు రావాలని ఆరాటపడుతుంటే వాళ్లను తీసుకొని రావటానికి నేను, యర్రగొండపాలెం ఇన్‌చార్జి చంద్రశేఖర్ వెళ్లాం... ఈ లోపు కుర్చీలు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్యేలు కూర్చున్నారు.. దానిని ఏదో జరిగిపోయినట్లు చూపించడం మంచిది కాదని ఎల్లో మీడియాకు హితవు పలికారు. ఇచ్చిన మాట నిలుపుకొనే వ్యక్తి జగనన్న 2020లో మాట ఇచ్చాడు 2024లో ప్రాజెక్టు పూర్తి చేశాడన్నారు. అభివృద్ధి అంటే టీడీపీకి నచ్చదు, అందుకే కడుపు మంటతో అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. నిద్రపోయే వాళ్లని లేపవచ్చు నిద్ర నటించే వాళ్లను లేపలేం... ప్రాజెక్టు పూర్తి కాలేదు అనే వాళ్లకు తీసుకెళ్లి చూపిస్తాం రాండి అభివృద్ధి చెయడం చేతకాదు కానీ, మా ప్రభుత్వం పై నిందలు వేయటం సరికాదన్నారు. ఓటమి ఖాయం అని తెలిసే ప్రశాంత్ కిషోర్ చేత అసత్యాలు పలికిస్తున్నారన్నారు. రెండు నెలల్లో ఎవరు ఓడుతారో తెలుస్తుందని చెప్పారు. ప్రజలే న్యాయ నిర్ణేతలన్నారు.

శివరాత్రికి 165 ప్రత్యేక బస్సులు


ఒంగోలు: మహాశివరాత్రిని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం 165 బస్సులను శ్రీశైలం, కోటప్పకొండకు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి బి.సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటప్పకొండకు ఒంగోలు నుంచి 45, శ్రీశైలానికి ఒంగోలు నుంచి 15, పొదిలి నుంచి 25, మార్కాపురం నుంచి 80 సర్వీసులు నడుపుతున్నామన్నారు. కనిగిరి నుంచి భైరవకోనకు 20, పొదిలి నుంచి రామతీర్థానికి 10 బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ బస్సులకు ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా నిర్వహిస్తున్నామన్నారు.

బడుగులకు వైఎస్సార్ చేయూతతో అండ



చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల చెందిన మహిళలకు ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలబడుతోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నాలుగో విడత అర్హులైన లబ్ధిదారులకు నేరుగా నిధులు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా కశింకోటలో ప్రారంభించగా దీనికి అనుబంధంగా జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రకాశం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత కింద ప్రస్తుతం నాలుగో విడత కింద జిల్లాలో 98,848 మంది లబ్ధిదారులకు రూ.185.34 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగిందన్నారు. ఈ నాలుగేళ్లలో జిల్లాలో రూ.670.21 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందని చెప్పారు. లబ్ధిదారులకు రూ.184.34 కోట్ల విలువైన బ్యాంకు చెక్కును కలెక్టర్ అందించారు. మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, శ్రీ వైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్, మేదర కార్పొరేషన్ చైర్ పర్సన్ లలితా నాంచారమ్మ, ఏపీ రాష్ట్ర టైలర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ షేక్ సుభాని బీ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ పాల్గొన్నారు.



మహిళలు..మహరాణులు అన్న గొప్ప పదానికి అర్థం...పరమార్థం తీసుకొచ్చారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. పదవులే కాదు అధికారాలను సైతం మహిళలు సక్రమంగా...సమర్థవంతంగా చేయగలరు అని బలంగా నమ్మి, వారిపై నమ్మకాన్ని ఉంచి పెద్దపీట వేశారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోయేలా మంత్రి పదవులు మొదలుకొని, అధికార పార్టీలో ఎన్నో రకాల పదవుల్లో వారిని అధిరోహించేలా పూర్తి స్థాయిలో ప్రోత్సహించారు. అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలబెడుతున్నారు. జిల్లాలో సైతం మహిళలకు అగ్రస్థానమిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు అగ్రతాంబూలం
- అధికారంలో..సంక్షేమంలో ఆమెకే ప్రాధాన్యం
- జిల్లా, ఒంగోలు నగర ప్రథమ పౌరులిద్దరూ మహిళలే
- జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఏ.భారతి
- భర్త సేవా, రాజకీయాల్లో వెన్నంటి నడుస్తున్న శచీదేవి
- పలు సేవా కార్యక్రమాల్లో మహిళా ఆర్కిటెక్ట్ నున్నా హరిప్రియ

రేపటికి
ముందడుగు

నవయుగం.. ఆమెదే పవర్..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో ప్రథమ మహిళ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు అవకాశం కల్పించి మహిళలకు నంబర్‌వన్ స్థానాన్ని కల్పించారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. అదేవిధంగా ఒంగోలు నగర ప్రథమ మహిళగా ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాతను అందలం ఎక్కించి గౌరవించారు. అంతకంటే గొప్పగా జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఏ.భారతి న్యాయాన్ని దశ దిశలా వ్యాపింపజేస్తున్నారు. ఇలా

జిల్లాలో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం (ఉమ్మడి ప్రకాశం జిల్లాలో)....		
హోదా	మొత్తం సంఖ్య	మహిళల సంఖ్య
జెడ్పీ చైర్‌పర్సన్	01	01
జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌లు	02	02
జెడ్పీటీసీ సభ్యులు	55	34
ఎంపీపీలు	53	32
ఎంపీటీసీ సభ్యులు	718	412
మొత్తం గ్రామ పంచాయతీలు	1011	554
గ్రామ పంచాయతీల్లో వార్డులు	10,076	5,458

చెప్పుకుంటూ పోతే జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్లుగా ఇరువురు మహిళలకే పట్టంగట్టారు. ఒకరు సింగరాయకొండ జెడ్పీటీసీ సభ్యురాలు ఎ.అరుణ కాగా రెండో మహిళ మార్టూరు జెడ్పీటీసీ సభ్యురాలు చుండి సుజ్ఞానమ్మ. డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్‌గా రావి పద్మావతి రామనాథం బాబు, జిల్లా లైబ్రరీ చైర్‌పర్సన్‌గా ఆర్.వెంకట సుశీల, ఒంగోలు అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీకి చైర్‌పర్సన్‌గా శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా బత్తుల పద్మావతితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కులాల కార్పొరేషన్లకు చైర్మన్లుగా, డైరెక్టర్లుగా మహిళకే ఇచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే సగంకాదు మహిళలకు సగంకంటే ఎక్కువ పదవులిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్.

సంక్షేమ పథకాల్లోనూ అగ్రతాంబూలం...

ప్రభుత్వం ఇస్తున్న పదవులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లోనూ అతివలకే అగ్రతాంబూలం ఇచ్చారు. ఇళ్ల పట్టాలు కూడా మహిళల పేరు మీదనే ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారు. వీటితో పాటు అమ్మ ఒడి, డ్వాక్రా గ్రూపు మహిళలకు బ్యాంకు లింకేజీ కింద సున్నా వడ్డీ, సబ్సిడీలు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంకు రుణాలు, ఇన్సెంటివ్‌లు, జగనన్న పాల వెల్లువ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా ఇలా పలు సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రథమ ప్రాధాన్యత దక్కుతోంది.

మహిళా ఆర్కిటెక్ట్‌గా నున్నా హరిప్రియ...



మహిళా ఆర్కిటెక్ట్‌గా నున్నా హరిప్రియ ఒంగోలు నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఒంగోలుకు చెందిన నున్నా హరిప్రియ 2006లో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోనే ప్రముఖ ఆర్కిటెక్చర్ సంధ్యశ్రీ దగ్గర ఆరు నెలలు అప్రెంటిస్ పూర్తి చేశారు. అక్షయ ఇన్‌ఫ్రా కంపెనీలో జూనియర్ ఆర్కిటెక్ట్‌గా కొంతకాలం పనిచేశారు. అనంతరం ఒంగోలు నగరంలో సొంతంగా క్రియేటివ్ డిజైన్స్ కార్యాలయాన్ని స్థాపించారు. మెటీరియల్ కాంట్రాక్ట్స్, ప్లానింగ్ అండ్ ఇంటీరియల్ వర్క్స్‌లో తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఎంతో ప్రాముఖ్యతను సాధించారు. నగరంలోని అనేక ప్రాజెక్టులు చేపట్టారు. ఆస్పత్రులు, అపార్ట్‌మెంట్స్, బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మాణంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. నగరంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్న తలంపుతో 2014లో సుహరి ఫౌండేషన్‌ను స్థాపించారు. భర్త సహాయ సహకారాలతో పేద పిల్లలకు దుస్తులు అందించటంతో పాటు పేద విద్యార్థులకు చేదోడు వాదోడుగా ఉంటూ వస్తున్నారు. వేసవిలో నగరంలో మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

భర్త సేవా కార్యక్రమాల్లో తోడుగా శచీదేవి...



భర్త సేవా కార్యక్రమాల్లో, రాజకీయాల్లో వెన్నంటి ఉంటూ ప్రోత్సహిస్తున్నారు బాలినేని శచీదేవి. ప్రతి విషయంలోనూ ప్రత్యక్షంగా ఉండకపోయినా భర్త ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటూ అటు పుట్టింటిలో ఇటు మెట్టినింటిలో ఆయా కుటుంబాల గౌరవాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగుతున్నారు. గౌరవమైన యర్రం చినపోలిరెడ్డి కుటుంబంలో నుంచి అదేస్థాయి కుటుంబమైన బాలినేని వెంకటేశ్వరరెడ్డి కోడలిగా ఒంగోలులో అడుగుపెట్టారు. మాజీ మంత్రి, ప్రస్తుతం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి సతీమణిగా ఆ కుటుంబం కీర్తి ప్రతిష్టలను పెంపొందించుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్నారు. ఒంగోలు నగరంలోని ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చటంలో బాలినేని శచీదేవి పాత్ర కూడా మరిచిపోలేనిది. ఇంటి పట్టాతో పాటు మహిళలకు చీరలు పెట్టాలని బాలినేని తలిస్తే, లబ్ధిదారులైన దంపతులకు దుస్తులు పెడదామని శచీదేవి సలహా ఇచ్చారు. కుమారుడు ప్రణీత్ రెడ్డి, కోడలు శ్రీ కావ్యతో కలిసి డివిజన్ల వారీగా పేదలకు ఇళ్ల తలుపు తట్టి పట్టాలతో పాటు దుస్తులు అందిస్తున్నారు.

మహిళకు అగ్రతాంబూలం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు అగ్రతాంబూలం ఇచ్చి గౌరవిస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వ పాలనను కూడా సాగిస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి తీసుకురాని సంస్కరణలను తీసుకొచ్చి మహిళలకు భరోసా ఇస్తున్నారు. రాష్ట్రంలో అన్ని పదవుల్లో మహిళలకు 50 నుంచి 60 శాతం వరకు పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారు. సామాజికంగా ఆర్థికంగా ఎదగటానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. మహిళల రక్షణ కోసం దిశా పోలీస్ స్టేషన్‌లు, ప్రమాద స్థలానికి పోలీసులు వెంటనే చేరుకోవటానికి దిశా యాప్‌ను మహిళలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

మహిళలకు రక్షకుడుగా సీఎం వైఎస్ జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు రక్షకుడుగా పరిపాలన చేస్తున్నారు. ఆడపిల్లలను చదివించాలంటూ ప్రత్యేకంగా తల్లులకు అమ్మఒడి పథకం ద్వారా ప్రతి సంవత్సరం వారి బ్యాంకు అకౌంట్లలో డబ్బులు వేస్తున్నారు. చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకొని సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికలు సిద్ధం చేసి మహిళలను ప్రోత్సహిస్తున్నారు. మా లాంటి వారికి మేయర్ పదవులను, నగర పాలక సంస్థల్లో, మున్సిపాలిటీల్లో, నగర పంచాయతీల్లో మున్సిపల్ చైర్మన్లుగా, కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా కూడా అవకాశాలు కల్పించి రాజకీయంగా ప్రోత్సహించారు.

– గంగాడ సుజాత, ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్

తాగునీటి సమస్య పరిష్కారమే అజెండా

- పశ్చిమ ప్రాంతంలో తాగునీటి అవసరాలపై చర్చ
- అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్లతో తాగునీరు
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో నీటి సరఫరాలకు నిధులు
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అజెండా ఆమోదం
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పక్కన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పశ్చిమ ప్రాంతంతో పాటు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడటమే అజెండాగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక పాత జెడ్పీ సమావేశం మందిరంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించి అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి పనులు జరుగుతున్న వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కోరారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సంబంధించి వారంలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకునేందుకు అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకుంటోంది. ఆ మేరకు వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభమైన నేపథ్యంలో సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

2023–24లో సీపీడబ్ల్యూఎస్ స్కీములకు సంబంధించి 28 పనులకు రూ.2319 లక్షల్లో జిల్లా ప్రజాపరిషత్ పరిపాలనా ఉత్తర్వులు ఇప్పటికే ఇచ్చారు. 687 ఆవాసాలకు ప్రతిరోజు నీటి సరఫరా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ఈ ఏడాదిలో 2428 పనులు మంజూరు కాగా వాటిలో 1619 పనులు రూ.287.71 కోట్లతో చేపట్టి 1183 పనులు పూర్తి చేసినట్లు వివరించారు. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా జిల్లాలో పశ్చిమ ప్రాంతంలోని యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాల్లో అన్నీ ఆవాసాలకు సరిపడా నీటిని అందించేలా రూ.1290 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఉత్తర్వులు ఇచ్చి ఆ మేరకు సర్వే పనులు పూర్తి చేసి నిర్మాణాల డిజైన్‌లు ఆమోదించినట్లు అధికారులు సమావేశంలో తెలిపారు. జిల్లా పరిషత్ జనరల్ నిధుల నుంచి గ్రామీణ నీటి సరఫరా కోసం 164 పనులు రూ.683 లక్షల అంచనాతో చేపట్టగా వాటిలో 35 పనులు పూర్తయి, 72 పనులు వివిధ దశలో జరుగుతున్నట్లు వివరించారు.

సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికే నవరత్నాలతో అన్నీ వర్గాల ప్రజలకు మేలు చేశారన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అన్నీ చర్యలు తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాను ఆమోదించినట్లు తెలిపారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నీటి సమస్యతో పాటు ఇతర అన్నీ సమస్యలను రాబోయే మూడు, నాలుగు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. యర్రగొండపాలెం, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలకు సంబంధించి 2022 అక్టోబర్ వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన నీటి సరఫరా బిల్లులు రూ.41.69 కోట్లు ఈనెల 5వ తేదీ చెల్లింపులు చేసినట్లు తెలిపారు. మిగిలిన బిల్లులు కూడా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, బాపట్ల డీఆర్‌ఓ సత్యబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మర్దన్ అలీ, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

9 నెలల్లో 2 టౌన్‌షిప్‌ల నిర్మాణం



35 డివిజన్‌లో లబ్ధిదారులకు ఇంటి పట్టా అందజేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

- ఒకేరోజు 10 డివిజన్లలో పట్టాల పంపిణీ, దుస్తుల పంపిణీ కార్యక్రమం
- కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి


ఒంగోలు సబర్బన్: ఇళ్లులేని నిరుపేదకు సొంతింటి కల సాకారం చేయటానికి 9 నెలల్లో ఒంగోలు నగరంలోని రెండు ప్రాంతాల్లో టౌన్‌షిప్‌ల నిర్మాణం పూర్తి చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన నగరంలోని ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాల భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కూడా చేపట్టారు. వరుసగా ఒంగోలు నగరంలో నాలుగో రోజు పట్టాల పంపిణీతో పాటు లబ్ధిదారులైన దంపతులకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని బాలినేని చేపట్టారు. గురువారంతో మొత్తం 32 డివిజన్లలో పంపిణీ చేశారు. ఈ ఒక్కరోజులోనే 10 డివిజన్లలో పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఒక్కరోజే మొత్తం 3,195 మంది లబ్ధిదారులకు పట్టాలతో పాటు దుస్తులు కూడా పంపిణీ చేశారు. బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు పంపిణీ చేస్తుంటే వారి వెంటనే యువనేత, బాలినేని తనయుడు ప్రణీత్ రెడ్డి, శ్రీ కావ్య దంపతులు మిగతా అందరికీ పంపిణీ చేసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఇస్తున్న ఈ ఇళ్ల పట్టాల ద్వారా రెండు టౌన్‌షిప్‌లు అగ్రహారం వద్ద, వెంగముక్కల పాలెం వద్ద నగర పరిధిలోనే ఏర్పాటు చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా ఏర్పాటు చేస్తామన్నారు. మొత్తం ఒంగోలు నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. టీడీపీ నాయకుల కుయుక్తులను దీటుగా ఎదుర్కొన్నామని చెప్పారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఐదేళ్లుగా నగరంలోని సొంత ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిద్దామనుకుంటే హైకోర్టుకు వెళ్లి అదేపనిగా ఆపేస్తున్న టీడీపీ నాయకులు, మరీ ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేదలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. నలుగురు చీఫ్ సెక్రటరీలు వచ్చి సీఎం చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు ఇస్తే దొంగ పట్టాలు అంటున్నారంటే టీడీపీ నాయకులకు మతి పోయిందన్నారు. మొదట 14 డివిజన్‌లోని సంతపేటలో ప్రారంభించిన ఈ కార్యక్రమం 12వ డివిజన్‌తో ముగిసింది. మధ్యలో 15, 23, 48, 47, 34, 35, 20, 44 డివిజన్లలో కూడా పంపిణీని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.జశ్వంతరావు, ఒనూడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవ రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, డివిజన్ల కార్పొరేటర్లు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, చింతపల్లి గోపీచంద్, షేక్ ఇంతియాజ్, వేమూరి భవాని, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, పశుపులేటి విజయ లక్ష్మి, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

మాట ఇచ్చాడంటే..చేస్తాడంతే

- వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాల పర్మినెంట్
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాలు
- సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రకమంటున్న ఉద్యోగులు

ఒంగోలు టౌన్: వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2001 నుంచి 2014 జూన్ వరకు వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎం, ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంపీహెచ్ మేల్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో జిల్లాలో పనిచేస్తున్న 47 మంది ఎంపీహెచ్ (మేల్) , 15 మంది ఫార్మాసిస్టులు, 8 మంది ల్యాబ్ టెక్నీషియన్లు మొత్తం 70 మందిని, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలో 33 మంది ఏఎన్ఎంలను రెగ్యులర్ చేశారు. గత 23 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వీరంతా తమను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబును కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. తాను అధికారంలోకి వస్తే వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని మాట ఇచ్చారు. ఒకసారి మాట ఇచ్చాడంటే చాలు అమలు చేసి తీరుతాడన్న ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల కుటుంబాల్లో సంతోషాలు నింపారని కృతజ్ఞతలు తెలిపారు.


జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మేము 23 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ బేసిక్‌లో ఉద్యోగం చేస్తున్నాం. మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని అనేక ఏళ్లుగా పోరాడుతున్నాం. చాలా మంది మాట ఇచ్చారు కానీ నిలబెట్టుకోలేదు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం ఇచ్చిన నిలబెట్టుకున్నారు. మా సంతోషాన్ని మాటల్లో చెప్పలేం. మా కుటుంబాల్లో సంతోషం నింపినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– దుద్దు బుచ్చిబాబు, ఫార్మాసిస్ట్, కొరిశపాడు

మా కల నెరవేరింది



పర్మినెంట్ ఉద్యోగాలు అనేవే లేకుండా పోయిన ఈ రోజుల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం అంటే మామూలు విషయం కాదు. జీవితాంతం కాంట్రాక్ట్ ఉద్యోగిగానే మిగిలిపోతానేమో అనుకున్నాను. సొంత అన్నలా మా కల నెరవేర్చారు. ఒక మంచి పని చేయాలంటే మంచి హృదయం ఉండాలి. ఈ నిర్ణయంతో ప్రజల నుంచి వచ్చిన నాయకుడిగా నిరూపించుకున్నారు.

– రజని, ఫార్మాసిస్ట్, ఈపూరుపాలెం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గాల పరిశీలకుల నియామకం

ఒంగోలు: ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు వైఎస్సార్ సీపీ పరిశీలకులను నియమించింది. మార్కాపురానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, కనిగిరికి రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, దర్శికి పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఒంగోలు నియోజకవర్గానికి పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, యర్రగొండపాలేనికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, కొండపికి రాచగొర్ల పిచ్చయ్య యాదవ్‌లను నియమించినట్లు గురువారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

క్లుప్తంగా

రెండు ఎకరాల కొబ్బరి తోట దగ్ధం


కాలిపోయిన కొబ్బరితోట

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు సమీపంలో గురువారం రెండు ఎకరాల కొబ్బరి తోట దగ్ధమైంది. తోట కాపాలాదారులు ఎస్‌కె నన్నేసాహెబ్, అశోక్ కథనం మేరకు.. ఏడుకొండలు అనే రైతుకు చెందిన కొబ్బరి తోటకు సమీపంలో చెత్తకు గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో గాలికి నిప్పు రవ్వలు ఎగసి పడ్డాయి. ఎండ అధికంగా ఉండటంతో పాటు ఈదురు గాలులకు కొబ్బరితోటలో మంటలు చెలరేగాయి. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు ఏడుకొండలు ఆవేదన వ్యక్తం చేశారు.

స్టెప్ జిల్లా కమిటీ ఎన్నిక

ఒంగోలు టౌన్: స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటర్స్, పేరంట్స్(స్టెప్) సామాజిక సంస్థ జిల్లా కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ మస్తాన్ రావు, అధ్యక్షుడిగా సయ్యద్ సాబిర్ హుసేన్, ప్రధాన కార్యదర్శిగా మండాది ధనరాజ్, కోశాధికారిగా పఠాన్ సాధిక్ ఖాన్, ఉపాధ్యక్షులుగా ఇండ్ల ఏసుపాదం, బా రహంతుల్లా, కార్యదర్శులుగా ఎం.సుబ్బారావు, పగడాల చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంఏ సాలార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ.. విద్యార్థులు, తలిదండ్రుల ఆలోచనా వైఖరిలో మార్పు కోసం గత పాతికేళ్లుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడకుండా సమాజంలో ఎలాంటి మార్పు రాదన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూనే మన మూలాలు మరిచిపోకూడదన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్ నియామకాల మెరిట్ లిస్ట్ విడుదల

ఒంగోలు టౌన్: వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ బాపట్ల ఎన్టీపీ ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ నియామకానికి సంబంధించి మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ నియంత్రణ శాఖాధికారిణి శ్రీవాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్, టీబీహెచ్‌వీ సూపర్‌వైజర్, పీపీసీ, అకౌంటెంట్ ఉద్యోగాల నియామకాలకుగాను గత ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 9 వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు వివరించారు. దరఖాస్తుల పరిశీలన అనంతర మెరిట్ లిస్టు తయారు చేసి ప్రకాశం జిల్లా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11వ తేదీలోగా రాతపూర్వకంగా జిల్లా కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. గడువు తరువాత వచ్చే ఫిర్యాదులను స్వీకరించేది లేదని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- మృతుడిది ఉలవపాడు మండలం చాగల్లు గ్రామం


ప్రమాదంలో మృతి చెందిన తిరుమలరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్‌లో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్ట్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఒంగోలు తాలూకు సీఐ కె.భక్తవత్సలరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాగల్లు గ్రామానికి చెందిన కొనికి తిరుమల రావు(30) తన మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే ఒంగోలు దక్షిణ బైపాస్ వద్ద రోడ్డుపై ఆగిన ఆటోను బైక్ అదుపుతప్పి ఢీకొట్టాడు. ఆ తరువాత పక్కనే సోడా బండిని కూడా ఢీకొట్టాడు. రోడ్డు మీద పడిపోవటంతో తలకు బలమైన గాయమై తిరుమలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో

ఒంగోలు: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి, వారి కోడలు శ్రీకావ్య, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి తదితరులు పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

రేపటికి ముందడుగు

ఒంగోలు టౌన్: మొదట్లో అబల అన్నారు.. వంటింటికి పరిమితం చేశారు.. తరువాత ఆకాశంలో సగం అన్నారు. చీకటిని ఆమెకు అప్పగించేసి వెలుతురును దూరం చేశారు. చందమామ కథలను ఓపిగ్గా విన్న ఆమె అన్నిటినీ సహించింది. కష్టాలను భరించింది. ఆటుపోట్లను ఎదుర్కొంది. ఆంక్షలను చేధించి బతుకు పరుగులో విజయ కేతనం ఎగరేసింది. ఇపుడామె సగం ఆకాశం కాదు సంపూర్ణ ఆకాశం. పొలంలో నాట్లు వేయడం దగ్గర నుంచి అంతరిక్షంలో పరిశోధనల వరకు ఆమె అడుగిడని రంగం లేదు. కుటుంబ బాధ్యతలనూ భుజానికెత్తుకొంది. పారిశ్రామికంగా సత్తా చాటుతోంది. అందుకే ఆమెకు పట్టం కట్టిన సమాజం చేయెత్తి సలాం చెబుతోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహింకుంటున్న సందర్భంగా విజయ నారీమణుల స్ఫూర్తి కథనాలు..

విజయ నారి

- కష్టాల కడలిని దాటి జీవితాలను చక్కదిద్దుకుంటున్న మహిళలు
- ప్రభుత్వ సాయానికి తోడు బ్యాంకు రుణాలతో వ్యాపారం
- స్వయం ఉపాధి పొందుతూ తోటి మహిళలకు అండగా..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం


కేసీఎఫ్‌లో యంత్రాలను చూపుతున్న కోటేశ్వరి

కోటేశ్వరి 'స్టార్' తిరిగింది

ఆమె పేరు సంగు కోటేశ్వరి. తాళ్లూరు గ్రామానికి చెందిన ఆమెకు గిద్దలూరుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అంకిరెడ్డితో వివాహమైంది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు. తగినంత ఆదాయం లేకపోవడంతో 25 ఏళ్ల క్రితం గిద్దలూరు నుంచి ఒంగోలు చేరుకున్నారు. ఇక్కడి నెహ్రూనగర్‌లో అంకిరెడ్డి ప్రాక్టీస్ ప్రారంభించినా నిరాశే ఎదురైంది. సరిగ్గా అప్పుడే వైఎస్సార్ మంజూరు చేసిన పావలా వడ్డీకే డ్వాక్రా రుణాలు ఆమెను ఆకర్షించాయి. రూ.2 లక్షల రుణం తీసుకుని కేసీఎఫ్ ప్రోడక్ట్స్ పేరుతో ఇంటి వద్దే వక్కపొడి తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ప్రజల ఆదరణ బాగుండటంతో ఇక ఆమె వెనక్కు చూడలేదు. స్టార్ వక్క పొడి, సంగు నమ్‌కీన్స్, యాహూ మౌత్ ఫ్రెషనర్స్, పేడ రంగు తయారు చేసి విక్రయించడం మొదలు పెట్టారు. రాయలసీమలోని గ్రామాల్లో కేసీఎఫ్ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. ఒంగోలులోని బలరాం కాలనీలో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ఇప్పుడు పది మంది వరకు పని చేస్తున్నారు. నెలకు రూ.15 లక్షల టర్నోవర్ జరుగుతోంది. 'రాష్ట్రంలో మహిళలు నిలదొక్కుకునేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. మహిళలు వ్యాపార రంగంలో రాణించేందుకు నవరత్నాలు పథకాలు ఉపయోగపడుతున్నాయి. రుణాలు ఇవ్వడమే కాకుండా అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇవ్వడం మంచి పరిణామం' అని కోటేశ్వరి చెబుతున్నారు.

ఒంటరి పోరాటంలో విజేతగా..


హిమబిందు, హాట్ అండ్ క్రిస్పీ వ్యవస్థాపకురాలు

హిమబిందు.. ఒంగోలులోని గోపాల్ నగర్‌కు చెందిన మహిళ. ఎంబీఏ చదివి వైజాగ్‌లోని ఎన్నారై హాస్పిటల్‌లో హెచ్‌ఆర్‌గా ఉద్యోగం చేశారు. కోవిడ్ ఆమె జీవితాన్ని తల్లకిందులు చేసింది. భర్త కృష్ణ సుమంత్ కోవిడ్‌తో మరణించడంతో ఆమె జీవితాన్ని చీకటి కమ్మేసింది. తన ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని ఒంగోలులోని పుట్టింటికి చేరుకున్న హిమబిందు జీవితంలో స్థిరపడేందుకు ఆలోచనలకు పదునుపెట్టింది. తల్లి సహకారంతో అమెరికన్ కాంటినెంటల్ తరహాలో హాట్ అండ్ క్రిస్పీ ఫాస్ట్ ఫుడ్స్ ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని ఇంటి నుంచే ఫుడ్ విక్రయించడం ప్రారంభించారు. కరోనా సమయంలో ఒంగోలులోని ఉద్యోగులు, విద్యార్థులకు హాట్ అండ్ క్రిస్పీ చాలా దగ్గరైంది. క్వాలిటీ, రుచి బాగుండడంతో కస్టమర్ల సంఖ్య పెరిగింది. 2021లో డ్వాక్రాలో రూ.1.50 రుణం తీసుకుని అవసరమైన ఫ్రిడ్జ్, పిజ్జా ఓవెన్ కొనుగోలు చేశారు. హిమబిందు జీవితంలో స్థిరపడటమే కాకుండా మరో ముగ్గురికి ఉపాధి చూపిస్తున్నారు. నెలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు సంపాదిస్తున్నారు. భవిష్యత్తులో వ్యాపారాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుందని కితాబిచ్చారు. మహిళలకు మెప్మా, డీఆర్డీఏ ద్వారా సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

అభిమానం.. రయ్.. రయ్..!

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలని సిక్కోలు యువకుడి వినూత్న ప్రచారం



పొదిలి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ సిక్కోలు యువకుడు వినూత్న రీతిలో ప్రచారం కొనసాగిస్తున్నాడు. శ్రీకాకుళం నియోజకవర్గం గార మండలం అంపోలు గ్రామానికి చెందిన గోళ్ల సర్వేశ్వరరావుకు వైఎస్ జగన్ అంటే అమితమైన అభిమానం. ఎన్నికలు సమీపిస్తుండటంతో వినూత్నంగా ప్రచారం చేయాలని భావించాడు. రూ.1.50 లక్షలతో నూతన ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి, రూ.10 వేలు వెచ్చించి వైఎస్సార్ సీపీ జెండా రంగులు, సీఎం జగన్ ఫొటోలతో స్టిక్కరింగ్ చేయించాడు. శ్రీకాకుళం నుంచి తిరుపతి వెళ్తూ మార్గమధ్యంలో పొదిలిలో ఇలా 'సాక్షి' కెమెరాకు చిక్కాడు.

యువతకు విరివిగా ఉద్యోగావకాశాలు

- మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్
- కొండపిలోని సీతారామ ఫంక్షన్ హాల్లో మెగా జాబ్ మేళా
- 50కి పైగా కంపెనీల్లో 2 వేల మందికి ఉద్యోగాలు


కొండపిలో మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

కొండపి(టంగుటూరు): మెగా జాబ్‌మేళాతో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. కొండపిలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో మెగా జాబ్ మేళాను గురువారం మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండపి ప్రాంత యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు మున్ముందూ కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న కంపెనీలు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెరుగుతుండటంతో ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతున్నాయన్నారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చి తగిన ఉద్యోగం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. యువత కోసం అన్ని నియోజకవర్గాల్లో ప్రతి నెలా జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగ మేళాలను ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. 50 కంపెనీల్లో 2 వేలకు పైగా ఉద్యోగావకాశాలున్నాయని, యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉద్యోగం రాని వారు నిరాశపడకుండా ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా స్కిల్ హబ్ ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి కల్పించే ప్రక్రియ నిరంతరం సాగుతుందని స్పష్టం చేశారు. ముఖ్య అతిథి భరద్వాజ్ మాట్లాడుతూ.. యువత స్వశక్తితో జీవితంలో రాణించేలా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మరో ముఖ్య అతిథి రవితేజ యాదవ్ మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లాలో లోకల్ ఇండస్ట్రీస్‌లో బీకామ్ టాలీ చేసిన వారికి, అలాగే బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్స్ విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమాన్ని దేశం మెచ్చింది


మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

మద్దిపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్ల పది నెలల వ్యవధిలో రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దేశంలోని అన్ని రాష్ట్రాలు ప్రశంసించాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా సంక్షేమాన్ని దేశంలో ఏపార్టీ నాయకుడైనా చేశారా అని మంత్రి ప్రశ్నించారు. గురువారం రాత్రి ఆయన మద్దిపాడు మండలంలోని లింగంగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో మాట్లాడారు. పేద బడుగు బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును గుర్తించి మద్దతుగా నిలవాలని కోరారు. మంచి జరిగితేనే తనకు ఓటు వేయండని అడిగిన దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కీర్తించారు. రాష్ట్రంలోని ఆర్‌బీకేలను దేశంలోని పలు రాష్ట్రాల ప్రతినిధులతో సహా విదేశీయులు కూడా చూసి శభాష్ అని కొనియాడిన వైనాన్ని వివరించారు. ఇటీవలే నీతి ఆయోగ్ కూడా ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలను ప్రశంసించిందని పేర్కొన్నారు. ప్రజల్లో జగనన్నకు పెరుగుతున్న గ్రాఫ్ చూసి ఓర్వలేని పచ్చపత్రికలు రోజూ ఒక అంశంపై విషం చిమ్ముతూనే ఉన్నాయని, కానీ వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలుసునన్నారు. పక్క రాష్ట్రంలో నివాసం ఉంటూ ఇక్కడికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లే నాయకులు ఎవరో ప్రజలకు తెలుసునని ఎద్దేవా చేశారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకోవడానికే చివరిసారి గెలిపించండంటూ చంద్రబాబు ప్రాధేయపడుతున్నాడని, బాబును నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, ఓబులరెడ్డి, తేళ్ల పుల్లారావు, పోతినేని శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, ఎంపీటీసీలు పైనం ప్రభాకర్, బొమ్మల దేవదాసు, పలువురు సర్పంచ్‌లు, గ్రామ సర్పంచ్ జనార్దన్, షేక్ బాబు, శ్రీరాములు శ్రీకాంత్, పలువురు పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు
- ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి


త్రిపురాంతకంలో మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు సబర్బన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పోలీస్ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు భద్రతతోపాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని స్థానిక పోలీసులకు లేదా 112 కానీ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు, తిరునాళ్లు, రథోత్సవాలు, ఘాట్లు, తీర ప్రాంతాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్ పైనా దృష్టి సారించామని, చోరీలు జరగకుండా ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

త్రిపురాంతకంలో ఏర్పాట్ల పరిశీలన

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవం సందర్భంగా పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల వద్ద ఏర్పాట్లను ఎస్పీ పరమేశ్వరరెడ్డి పరిశీలించారు. ఆయనకు ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు, ఈఓ చెన్నకేశవరెడ్డి సాదర స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. త్రిపురాంతకం ఆలయాల వద్ద 150 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐలు సుబ్బారావు, షమీవుల్లా, ఎస్సై సాంబశివయ్య ఉన్నారు. ముందుగా త్రిపురాంతకం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు.

అటెన్షన్.. ఎలక్షన్ మోడ్... లెఫ్ట్ రైట్.. లెఫ్ట్ రైట్..


కేంద్ర పోలీస్ బలగాలతో కలిసి కవాతులో పాల్గొన్న డీఎస్పీ కిషోర్ బాబు, సీఐలు, ఎస్సైలు

- ఒంగోలు నగరంలో కేంద్ర పోలీస్ బలగాల కవాతు
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా..
- నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు పోలీసుల పిలుపు

ఒంగోలు సబర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు, అందులో భాగంగా ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కేంద్ర పోలీస్ బలగాలు గురువారం రాత్రి ఒంగోలు నగరంలో కవాతు నిర్వహించాయి. ఎస్పీ పీ.పరమేశ్వర రెడ్డి నేతృత్వంలో ఒంగోలు డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నగరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్న సంకేతాన్ని ప్రజల్లోకి పంపేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. దక్షిణ బైపాస్ నుంచి మినీ స్టేడియం, నెల్లూరు బస్టాండ్, ప్రకాశం భవన్, చర్చి సెంటర్, ట్రంకు రోడ్డు, మస్తాన్ దర్గా సెంటర్, పాత మార్కెట్, అద్దంకి బస్టాండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, కర్నూల్ రోడ్డు మీదుగా ఫ్లైఓవర్ వరకు కవాతు సాగింది. డీఎస్పీ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. వన్‌టైన్ సీఐ ఎం.లక్ష్మణ్, టూటౌన్ సీఐ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ ఇంటర్ పరీక్షలకు 1,169 మంది డుమ్మా

ఒంగోలు: సీనియర్ ఇంటర్ గణితం 2ఎ, బోటనీ, సివిక్స్ పరీక్షలకు గురువారం 1169 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 17,537 మందికి 16,699 మంది, ఒకేషనల్ విభాగంలో 2564 మందికి 2233 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.


భైరవకోనలో ఏర్పాట్లు

శివపూజకు వేళాయే..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు విద్యుద్దీపకాంతులతో మెరిసిపోతున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేశారు. శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.


సంతపేట సాయి మందిరంలో రుద్రాక్షల శివలింగం